# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు










ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 348 పేజిలు : 04 వెల రూ. 2 శుక్రవారం 31 - 07 - 2026


# విద్యకోసం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- విద్యాశాఖకు నేనెందుకు రాజీనామా చేయాలి
- ఉపాధ్యాయుల సమస్యల పరిష్కార బాధ్యత తాను తీసుకుంటానన్న సీఎం రేవంత్
- విద్యకోసం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధమని వెల్లడి
- ఏడాదికి 10 నుంచి 12 మంది టీచర్లను విదేశాలకు పంపిస్తామని స్పష్టీకరణ




**హైదరాబాద్ :** ఆర్థిక సమస్యలు వెనకబాటుతనానికి కారణం కావటం లేదని, కేవలం విద్య లేకపోటవమే కారణమవుతోందని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఐదేళ్ల పాటు ఉపాధ్యాయులు విద్యార్థుల అభివృద్ధికోసం కృషి చేయాలని ఉపాధ్యాయుల బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. మండల స్థాయిలో పాఠశాలల సమస్యలను ఉపాధ్యాయ సంఘాలు డిసెంబర్ నాటికి ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామని ఆయన స్పష్టం చేశారు. 2034 వరకు తానే సీఎంగా ఉంటానన్న రేవంత్ రెడ్డి మధ్యతరగతి నుంచి వచ్చి ప్రభుత్వ పాఠశాలలో చదివి తాను సీఎం అయ్యానని గుర్తుచేశారు. ఫిన్లాండ్, జర్మనీ దేశాల్లో విద్యా విధానాలు, పాఠశాలలు అవలంభిస్తున్న విధానానలను స్టడీ చేసి వచ్చిన ఉపాధ్యాయులతో - మిగతా 2 లో



## 'వందేమాతరం' దేవతల ఆరాధనను ప్రతిబింబిస్తుంది

- ఎంఐఎం అధినేత, హైదరాబాద్ పార్లమెంట్ సభ్యుడు ఒవైసీ
- పార్లమెంట్ ఉభయసభల ఆమోదం పొందిన వందేమాతరం
- జనగణమన పాడినప్పుడు దేశ వైవిధ్యం కళ్లముందు కదలాడుతుందన్న ఒవైసీ

**హైదరాబాద్ :** పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందిన వందేమాతరం బిల్లు తీవ్ర రాజకీయ దుమారానికి దారితీస్తోంది. - మిగతా 2 లో

## వర్షంతో పాటు ఆకాశం నుంచి చేపలు!




- మంచిర్యాల జిల్లాలో వింత
- మంచిర్యాల జిల్లా చెన్నూరులో భారీ వర్షానికి అరుదైన దృశ్యం
- వర్షపు నీటితో పాటు వీధుల్లోకి కొట్టుకొచ్చిన చిన్న చేపలు
- చేపలను పట్టుకునేందుకు పోటీపడిన స్థానికులు, యువకులు
- సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోలు

## వందేమాతరం బిల్లుకు లోక్ సభ ఆమోదం



- వందేమాతరం అవమానాన్ని నేరంగా పరిగణించే బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- జాతీయ గీతంతో సమానంగా వందేమాతరానికి చట్టపరమైన రక్షణ
- అవమానిస్తే మూడేళ్ల జైలు, జరిమానా విధించేలా కఠిన నిబంధనలు
- ఉభయ సభల ఆమోదంతో రాష్ట్రపతి పరిశీలనకు చేరనున్న బిల్లు

**ఢిల్లీ :** జాతీయ గేయం వందేమాతరాన్ని అవమానించడం లేదా దాని గానానికి ఆటంకం కలిగించడాన్ని నేరంగా పరిగణించే కీలక బిల్లుకు లోక్‌సభ గురువారం ఆమోదం ముద్ర వేసింది. జాతీయ గౌరవ పరిరక్షణ (సవరణ) బిల్లు, 2026ను ప్రతిపక్షాల నిరసనల మధ్య సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. నిన్న ఈ బిల్లు రాజ్యసభలోనూ ఆమోదం పొందింది. 1971 నాటి జాతీయ గౌరవ పరిరక్షణ చట్టానికి ఈ బిల్లు సవరణలు చేపడుతుంది. ఇప్పటివరకు జాతీయ జెండా, రాజ్యాంగం, జాతీయ గీతం 'జన గణ మన'కు మాత్రమే ఉన్న చట్టపరమైన రక్షణ ఇకపై వందేమాతరం గేయానికి కూడా వర్తించనుంది. నూతన నిబంధనల ప్రకారం, ఎవరైనా ఉద్దేశపూర్వకంగా వందేమాతరం గానానికి ఆటంకం - మిగతా 2 లో

## రామమందిర ట్రస్ట్ తొలి కార్యదర్శిగా ఐఐటీ పూర్వ విద్యార్థి

- అక్రమాలు ఆగుతాయా అని ప్రతిపక్షాల ప్రశ్న
- రామమందిర ట్రస్ట్‌కు తొలి కార్యదర్శిగా జగదీశ్ అఫాలే
- విరాళాల అక్రమాలపై ప్రతిపక్షం ప్రశ్నలు
- చంపత్‌రాయ్‌పై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని నిలదీత
- ట్రస్ట్ పునర్వ్యవస్థీకరణ అవసరమన్న కాంగ్రెస్



**ఢిల్లీ :** అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌కు తొలి కార్యదర్శిగా ఐఐటీ బాంబే పూర్వ విద్యార్థి జగదీశ్ అఫాలేను నియమించారు. ఆలయ పరిపాలనతో పాటు ఆర్థిక లావాదేవీల్లోనూ - మిగతా 2 లో

## పంచాయతీ నిధుల పక్కదారిపై పూర్తి విచారణ జరపాలి


- కేంద్ర, రాష్ట్ర మంత్రులకు బండి సంజయ్ లేఖ
- పంచాయతీలకు కేంద్రం విడుదల చేస్తున్న నిధులను పక్కదారి పట్టిస్తున్నారన్న బండి సంజయ్
- నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలన్న బండి సంజయ్



**హైదరాబాద్ :** తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు కేంద్ర ఆర్థిక సంఘం విడుదల - మిగతా 2 లో

# ఇరాన్‌పై అమెరికా ప్రతీకార దాడులు

- మళ్లీ భగ్గుమన్న ఉద్రిక్తతలు
- తమ సైనిక స్థావరాలపై దాడికి యత్నించిన ఇరాన్‌పై అమెరికా ప్రతీకారం
- ఇరాన్‌లోని పలు ప్రాంతాలపై అమెరికా సైన్యం వైమానిక దాడులు
- జోర్డాన్‌లోని యూఎస్ స్థావరాలపై ఇరాన్ క్షిపణి దాడిని తిప్పికొట్టినట్లు వెల్లడి
- దాడులను ధ్రువీకరించిన అమెరికా సెంట్రల్ కమాండ్
- ఇరాన్‌పై నావికా దిగ్బంధనాన్ని కూడా కఠినతరం చేసిన అమెరికా




**ఢిల్లీ :** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. తమ సైనిక బలగాలపై ఇరాన్ దాడికి ప్రయత్నించిందన్న ఆరోపణలతో అమెరికా ప్రతీకార చర్యలకు దిగింది. ఇరాన్ లక్ష్యంగా కొత్త సైనిక దాడులను ప్రారంభించినట్లు ప్రకటించింది. కొన్ని నెలలుగా కొనసాగుతున్న సంఘర్షణలో ఇది మరో కీలక పరిణామం. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం రాత్రి 8 గంటలకు ఇరాన్‌పై దాడులు - మిగతా 2 లో



## జైలు వద్ద జగన్, సీదిరి అప్పలరాజుల ములాఖత్ రద్దు

- శ్రీకాకుళం అంపోలు జైల్లో రిమాండ్‌లో ఉన్న సీదిరి అప్పలరాజు
- ములాఖత్ లో కలిసేందుకు వెళ్లిన జగన్
- సాయంత్రం 5 గంటలు దాటడంతో అనుమతి నిరాకరించిన జైలు అధికారులు

**శ్రీకాకుళం :** రోడ్డు ప్రమాదం కేసులో అరెస్టయి శ్రీకాకుళం అంపోలు జైల్లో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి - మిగతా 2 లో

## విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి



- అధికారులకు మంత్రి గొట్టిపాటి ఆదేశం
- విద్యుత్ శాఖకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని గొట్టిపాటి సూచన
- అదనపు సిబ్బందిని క్షేత్రస్థాయిలో నియమించాలని ఆదేశం
- విద్యుత్ నష్టాలు అరికట్టేందుకు భూగర్భలైన్లు వేస్తున్నామని మంత్రికి వివరించిన అధికారులు

**అమరావతి :** అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రానున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాపై ప్రత్యేక - మిగతా 2 లో

# ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల ఎంపిక ఆంధ్రప్రదేశ్

- రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్
- గత ప్రభుత్వ చర్యలతో పెట్టుబడిదారుల విశ్వాసం కోల్పోయిందని వ్యాఖ్య
- త్వరలో ఆంధ్రప్రదేశ్ నుంచి విదేశాలకు క్లీన్ ఎనర్జీ ఎగుమతులు
- పరిశ్రమలు తేవడం మా బాధ్యత.. కష్టపడటం యువత బాధ్యత
- టాటా రెన్యువబుల్ ఎనర్జీ శంకుస్థాపన సభలో మంత్రి లోకేష్



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల తొలి ప్రాధాన్యతగా మారిందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. బ్రూక్‌ఫీల్డ్, బ్లాక్‌స్టోన్, బ్లాక్‌రాక్, ఈక్యూటీ, టీపీజీ వంటి ప్రతిష్టాత్మక గ్లోబల్ ప్రైవేట్ ఈక్విటీ ఫండ్‌లు ఏపీలో పెట్టుబడులు పెడుతున్నాయని, టాటా పవర్, సుజ్లాన్, రెన్యూ, ప్రీమియర్ ఎనర్జీస్, ఏసీఎంఈ, వారీ వంటి ప్రముఖ భారతీయ దిగ్గజ సంస్థల తమ కార్యకలాపాలను ఇక్కడ విస్తరిస్తున్నాయని ఆయన వెల్లడించారు. పత్తికొండ సమీపంలోని హోసూరు వద్ద టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ (టీపీఆర్ఈఎల్) ఆధ్వర్యంలో రూ.5,350 కోట్లతో అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఏర్పాటు చేయనున్న 800 మెగావాట్ల క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు గురువారం మంత్రి లోకేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, గత ఏడాదితో పోలిస్తే ఈ ఒక్క ఏడాదిలోనే ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 400 శాతం పెరిగిందని, రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న విశ్వసనీయత వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. "రాష్ట్రంలో 2024 జూన్ లో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు, పునరుత్పాదక ఇంధన రంగం పూర్తిగా అస్తవ్యస్తంగా ఉండేది. - మిగతా 2 లో

# సంపాదకీయం

## మహిళా రైతుకు 'మహా'పథం



రైతు అన్నప్పుడు మనకు సహజంగా పొలంలో హలంతో దున్నుతున్న, కొడవలితో పంట కోస్తున్న పురుషుడే స్ఫురిస్తాడు. ఈ పురుష పక్షపాత మనోవైఖరి మనకు ఆనువంశికంగా సంక్రమిస్తూ వస్తోంది. రైతును గురించి 'సైరికా! భారతక్ష్మాతలాత్మ/ గౌరవ పవిత్రమూర్తివి, శూరమణివి', అన్న మహాకవుల కీర్తిగానం విన్నప్పుడు కూడా నాట్లు, కోతలు, నూర్పిళ్ల శ్రమ చేసే మహిళ మన మనోదర్పణంలో కనిపించనే కనిపించదు. నిజానికి వ్యవసాయ పనులలో చాలా వాటిని నిర్వర్తిస్తున్నది మహిళలే అన్నది మనం ఇంకా గుర్తించని ఒక వాస్తవం. ఆర్థిక కార్యకలాపాలలో పాల్గొంటున్న మహిళల్లో 80శాతం మంది సేద్య రంగంలోనే క్రియాశీలంగా ఉంటున్నారు. ఆహారోత్పత్తిలోను, గ్రామీణ సంపద సృష్టిలోను కీలక పాత్ర పోషిస్తున్న మహిళలు భూ యాజమాన్య హక్కులు లేని కారణంగా తీవ్ర వివక్షకు గురవుతున్నారు. ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమాన్ని అందుకోలేకపోతున్నారు. ఈ అన్యాయాలను సరిచేసేందుకే మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 'మహారాష్ట్ర మహిళా రైతు సాధికారత చట్టం--2026'ను ఆమోదించింది. కుటుంబ కమతాలలో సాగుదారులుగా, జీవనోపాధికి వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్న లక్షలాది మహిళలకు ఇది సాధికారత కల్పించింది. ఇదొక చరిత్రాత్మక పథ నిర్దేశక చట్టం.వ్యవసాయ విధానాల విషయంలో ప్రభుత్వ వైఖరి వ్యవసాయదారుల శ్రేయస్సుకు దోహదం చేయడం లేదు. వ్యవసాయ ఉత్పత్తులకు ధరలు నిర్ణయించడంలో ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకే ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. ఫలితంగా రైతులు తమ పంట దిగుబడులకు సరైన ధర పొందలేకపోతున్నారు. దీనివల్ల వ్యవసాయరంగంలోని మహిళలు అమితంగా నష్టపోతున్నారు. మన దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఆహార భద్రతను సమకూర్చడంలో మహిళల మౌలిక పాత్రకు సరైన గుర్తింపు లేదు. అందుకే, వ్యవసాయ ఆహార వ్యవస్థలలో మహిళలకు సాధికారత కల్పించేందుకు ఐక్యరాజ్యసమితి 2026 సంవత్సరాన్ని అంతర్జాతీయ మహిళా రైతు సంవత్సరంగా పాటిస్తోంది. ఐరాస లక్ష్యసాధనకు దోహదం చేసే కృషిలో భాగంగానే మహారాష్ట్ర ప్రభుత్వం మహిళా రైతుల సాధికార చట్టాన్ని తీసుకువచ్చింది. ఎమ్ఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ సహకారంతో మహారాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టానికి రూపకల్పన చేసింది.జాతీయ రైతు విధానం (2007)కు అనుగుణంగా మహారాష్ట్ర చట్టం 'వ్యవసాయం', రైతు'కు విశాల నిర్వచనం ఇచ్చింది. పంటలసాగు, పాడి, మత్స్య, కోళ్ల పెంపకం పశు పోషణ, పట్టు పరిశ్రమ, తేనెటీగలు, పుట్టగొడుగుల పెంపకం, వ్యవసాయ--అడవులు, వ్యవసాయ ఉత్పత్తుల ప్రాథమిక ప్రాసెసింగ్‌లో యజమానిగానో లేదా పనివాళ్లుగానో పాల్గొనే వారందరూ రైతు కిందకే వస్తారు. ఈ ప్రస్తావిత కార్యకలాపాలు దేనిలోనైనా పాల్గొనే మహిళలు అందరూ రైతులేనని ఆ చట్టం పేర్కొంది. ఈ మహిళలకు మహిళా రైతు ధ్రువీకరణ పత్రం (ఉమన్ ఫార్మర్ సర్టిఫికెట్) జారీ చేయడం తప్పనిసరి. భూయాజమాన్య హక్కులతో నిమిత్తం లేకుండా ప్రతి మహిళా రైతుకు గ్రామ సభ వారికి ఈ సర్టిఫికెట్‌ను జారీ చేస్తుంది. ఈ సర్టిఫికెట్ ఉన్న మహిళలు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను అందుకోవడానికి జిల్లా, తాలూకా స్థాయిలో మహిళా రైతు సహాయక అధికారులను నియమించాలని ఆ చట్టం నిర్దేశించింది. మహిళా రైతుల ప్రయోజనార్థం ఒక కేంద్రీకృత డేటాబేస్‌తో పాటు ప్రత్యేక మహారాష్ట్ర మహిళా రైతు నిధినేర్పాటు చేయాలని కూడా ఈ విశిష్ట చట్టం నిర్దేశించింది. ఈ చట్టం అమలును ఉన్నతస్థాయిలో పర్యవేక్షించే మహిళా రైతుల సాధికారత మండలికి ముఖ్యమంత్రి అధ్యక్షుడుగా ఉంటారు. గ్రామీణ ప్రాంతాలలో భూములు, నీటి వనరులు, ఇతర సహజ సంపదల లభ్యత విషయంలో తీవ్రంగా ఉన్న అసమానతలను తొలగించేందుకు ఈ చట్టం దోహదం చేస్తుందనడంలో సందేహం లేదు. భర్తలు జీవనోపాధికై పట్టణాలకు వలస వెళ్లడం అనివార్యమైన పరిస్థితుల్లో కుటుంబ ఆహార భద్రతకు మరింతగా శ్రమించవలసివస్తున్న మహిళలకు ఈ సాధికారత చట్టం సహాయకారి కాగలదు.ఈ ప్రశస్త చట్టాన్ని అన్ని రాష్ట్రాలు సమగ్రంగా అధ్యయనం చేసి దాని స్ఫూర్తితో తదనుగుణమైన చట్టాలు తీసుకురావల్సిన అవసరమున్నది. రైతుకు విశాల నిర్వచనమిచ్చిన నేపథ్యంలో సంబంధిత కార్యకలాపాలలో పాల్గొంటున్న విభిన్న సంప్రదాయ సామాజిక శ్రేణులకు చెందిన మహిళలందరికీ గౌరవపూర్వకంగా రైతమ్మ అనే ఉమ్మడి గౌరవ నామవాచకాన్ని ప్రాచుర్యంలోకి తీసుకురావాల్సిన అవసరమున్నది. ఇటువంటి ప్రగతిశీల చట్టాలను చర్చించేందుకు, వాటిని ప్రజల దృష్టికి తీసుకువెళ్లేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాలలోని రైతు హితులు, పౌరసమాజ సంఘాలు, ప్రస్తుత, పూర్వ ప్రజాప్రతినిధులు శ్రద్ధ చూపాలి.

## జైలు వద్ద జగన్, సీదిరి అప్పలరాజుల ములాఖత్ రద్దు

**మొదటిపేజీ తరువాయి -** సీదిరి అప్పలరాజుతో వైసీపీ అధినేత జగన్ ములాఖత్ చివరి నిమిషంలో రద్దయింది. ములాఖత్ కోసం జగన్ కు జైలు అధికారులు సాయంత్రం 5 గంటల వరకు సమయం ఇచ్చారు. అయితే జైలు వద్దకు జగన్ చేరుకునే సమయానికి నిర్ణీత గడువు ముగిసిపోయింది. సమయం దాటిన తర్వాత కూడా అప్పలరాజును కలిసేందుకు వైసీపీ నేతలు అనుమతి కోరగా, జైలర్ ఉన్నతాధికారులతో సంప్రదించారు. జైలు నిబంధనల ప్రకారమే నడుచుకోవాలని, సాయంత్రం 5 గంటల దాటిన తర్వాత ఎలాంటి ములాఖత్‌కు అనుమతి లేదని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.జైలు నిబంధనల దృష్ట్యా అధికారుల నుంచి అనుమతి లభించకపోవడంతో జగన్, సీదిరి అప్పలరాజుల ములాఖత్ రద్దయింది. అనంతరం జైలు ప్రాంగణం వద్దే వేచి ఉన్న అప్పలరాజు కుటుంబ సభ్యులను జగన్ కలిసి పరామర్శించారు.

## వందేమాతరం బిల్లుకు లోక్ సభ ఆమోదం

**మొదటిపేజీ తరువాయి -** కలిగించినా లేదా దానిని అవమానించినా గరిష్టంగా మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. జాతీయ గీతంతో సమానంగా వందేమాతరానికి సమున్నత గౌరవం కల్పించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని ఆయన ఈ సందర్భంగా వివరించారు. సభలో చర్చ కొనసాగుతున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు ఇతర అంశాలపై పట్టుబడుతూ నిరసనలు వ్యక్తం చేయగా, వారు ప్రతిపాదించిన సవరణలను సభ తోసిపుచ్చింది. వందేమాతరం 150వ వార్షికోత్సవాల నేపథ్యంలో ఈ బిల్లును తీసుకురావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## వర్షంతో పాటు ఆకాశం నుంచి చేపలు!



**మొదటిపేజీ తరువాయి -** మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలో బుధవారం కురిసిన భారీ వర్షం ఓ అరుదైన దృశ్యాన్ని ఆవిష్కరించింది. వర్షపు నీటితో పాటు చిన్నపాటి చేపలు వీధుల్లోకి కొట్టుకురావడంతో స్థానికులు ఆశ్చర్యానికి లోనయ్యారు. రోడ్లపై కనిపిస్తున్న ఆ చేపలను పట్టుకోవడానికి పిల్లలు, యువకులు పోటీపడ్డారు.పట్టణంలోని పుప్పాల హనుమాన్ వీధిలో ఈ వింత ఘటన చోటుచేసుకుంది. కుండపోత వర్షం కారణంగా వీధులన్నీ జలమయమయ్యాయి. ఈ క్రమంలో వరద నీటిలో చేపలు కొట్టుకురావడం స్థానికులను విస్మయానికి గురిచేసింది. కొందరు ఇవి ఆకాశం నుండి పడ్డాయని భావించినప్పటికీ, ఈ చేపలు అసలు ఎక్కడి నుండి వచ్చాయనే అంశంపై స్థానికంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. చిన్నారులు, యువకులు ఉత్సాహంగా ఈ చేపలను పట్టుకున్నారు. దీనికి సంబంధించిన దృశ్యాలను కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అవి కాస్తా వైరల్ అయ్యాయి.ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా రుతుపవనాలు చురుగ్గా కదులుతుండటంతో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ఈ వానలకు చెరువులు, కుంటలు వంటి జలాశయాలు నిండి పొంగిపొర్లుతున్నాయి. ఈ క్రమంలోనే సమీపంలోని నీటి వనరుల నుంచి చేపలు వరద నీటితో పాటు జనావాసాల్లోకి కొట్టుకొచ్చి ఉంటాయని భావిస్తున్నారు.


# ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల ఎంపిక ఆంధ్రప్రదేశ్

**మొదటిపేజీ తరువాయి -** అంతకుముందు ఐదేళ్లలో కనీసం ఒక్క మెగావాట్ సామర్థ్యం గల ప్రధాన రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు కూడా ప్రారంభించలేదు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేశారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసం దెబ్బతింది. ప్రపంచంలోని అనేక అతిపెద్ద ఇన్‌ఫ్రా, క్లైమెట్ ఫండ్స్ ఆంధ్రప్రదేశ్‌ను బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాయి. ఒకసారి దెబ్బతిన్న విశ్వాసాన్ని పునరుద్ధరించడం రాత్రికి రాత్రే సాధ్యంకాదు. పెట్టుబడిదారుల్లో మళ్లీ నమ్మకాన్ని పెంపొందిస్తూ వచ్చాం" అని పేర్కొన్నారు.ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ – 2024ను ప్రవేశపెట్టి విస్తృతమైన విజన్‌తో 160 గిగావాట్ల క్లీన్ ఎనర్జీ సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని అన్నారు. సోలార్ మాడ్యూల్స్, సెల్స్ నుండి బ్యాటరీలు, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, ట్రాన్స్ మిషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, పోర్ట్స్, స్టోరేజీ సిస్టమ్స్.. ప్రపంచ స్థాయి తయారీ వరకు – మొత్తం క్లీన్ ఎనర్జీ సప్లయ్ చైన్ ను ఆంధ్రప్రదేశ్ లో నిర్మించాలని అనుకున్నామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛ ఇంధనాన్ని వినియోగించుకోవడమే కాకుండా, క్లీన్ ఎనర్జీ టెక్నాలజీలకు గ్లోబల్ ప్రొడ్యూసర్ గా మారాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని లోకేష్ తెలిపారు."టాటా రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ రూ. 5,750 కోట్ల పెట్టుబడితో, పత్తికొండలో 400 మెగావాట్ల సౌర విద్యుత్‌ను, అనంతపురం జిల్లా కనేకల్లులో 400 మెగావాట్ల పవన విద్యుత్‌తో కలిపి, 800 మెగావాట్ల హైబ్రిడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టుగా అవతరించబోతోంది. ఈ ఒక్క ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో దాదాపు 4,000 ఉద్యోగాలను కల్పిస్తుంది. 3,400 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో గల ఈ ప్రాజెక్టు ద్వారా 1,100 పైగా రైతు కుటుంబాలకు దాదాపు మూడు దశాబ్దాల పాటు స్థిరమైన కౌలు ఆదాయాన్ని అందిస్తుంది. ఈ ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్‌పైనా, మా పరిపాలనపైనా విశ్వాసానికి ప్రతీక.టాటా గ్రూప్‌తో మాకు దశాబ్దాల తరబడి అనుబంధం ఉంది. 1990లో నా తండ్రి చంద్రబాబు నాయుడు గారు హైదరాబాద్‌లో 'హైటెక్ సిటీ'ని నిర్మిస్తున్నప్పుడు, ఆయన దార్శనికతను నమ్మిన మొట్టమొదటి సంస్థలలో టిసిఎస్ ఒకటి. ఆ నమ్మకంతో కూడిన అనుబంధం నేటికీ కొనసాగుతోంది. 2024లో మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, నేను టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్‌ను కలిసి ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించడానికి ఆంధ్రప్రదేశ్ భిన్నంగా ఏమి చేయాలి అని అడిగాను. "వేగంపై దృష్టి పెట్టండి. పెట్టుబడిదారులకు ప్రోత్సాహకాల కంటే జాప్యం వల్ల కలిగే నష్టమే ఎక్కువ," అని ఆయన చెప్పారు. మా ప్రభుత్వ విధానం కూడా సింపుల్, స్పీడ్, స్టెబిలిటీలో భాగం అయ్యింది. శంకుస్థాపన నుండి ప్రారంభోత్సవం వరకు ప్రభుత్వం మద్దతుగా నిలబడుతుందనే విశ్వాసం మేము పెట్టుబడిదారులకు కల్పిస్తున్నాం" అని అన్నారు.'టాటా' అనే పేరు ఎల్లప్పుడూ నమ్మకం, నిజాయితీ, దేశ నిర్మాణం, ఆవిష్కరణలకు మారుపేరుగా నిలిచిందని లోకేష్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌తో టాటా బంధం చాలా బలీయమైనదని అన్నారు. ప్రభుత్వం, పారిశ్రామిక రంగం, రైతులు, ప్రజలు కలిసి క్లీన్ ఎనర్జీ, పరస్పర విశ్వాసం, భాగస్వామ్య స్ఫూర్తితో కూడిన సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తున్నామని అన్నారు. భారతదేశానికి దిశానిర్దేశం చేసే ఆంధ్రప్రదేశ్‌ను, స్వచ్ఛ ఇంధన రంగంలో ప్రపంచానికే నాయకత్వం వహించే భారతదేశాన్ని మనం కలిసి నిర్మిద్దామని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టాటా పవర్ సిఇఓ & ఎండి ప్రవీర్ సిన్హా, టాటా పవర్ రెన్యువబుల్ ఎనర్జీ సిఇఓ & ఎండి సంజయ్ బంగా, సుజలాన్ వైస్ చైర్మన్ గిరీష్ తంతి, భారీ పరిశ్రమల మంత్రి టిజి భరత్, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, కె.ఇ. శ్యామ్ బాబు, జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి, టాటా పవర్, సుజ్లాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి

**మొదటిపేజీ తరువాయి -** దృష్టి సారించాలని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. విశాఖపట్నంలోని ఈపీడీసీఎల్ అధికారులతో గురువారం వర్చువల్‌గా నిర్వహించిన సమీక్షలో విమానాశ్రయ ప్రారంభోత్సవ సమయంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం తలెత్తకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని క్షేత్రస్థాయిలో నియమించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్, ఆర్డీఎస్ఎస్ పథకాల పనులను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. పీఎం కుసుమ్, ఆర్డీఎస్ఎస్ పనులను ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని అధికారులు వెల్లడించారు. ఆర్డీఎస్ఎస్ పనుల వల్ల డిస్కంపై రూ.100 కోట్లకు పైగా ఆర్థిక భారం తగ్గిందని తెలిపారు. విద్యుత్ నష్టాల నివారణకు భూగర్భ విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులు శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి, తూర్పుగోదావరి జిల్లాల్లో కొనసాగుతున్నట్లు మంత్రికి అధికారులు వివరించారు.రానున్న గోదావరి పుష్కరాల దృష్ట్యా విద్యుత్ శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. మార్చి 2027 నాటికి పుష్కరాలకు సంబంధించిన అన్ని విద్యుత్ మౌలిక సదుపాయాల పనులు పూర్తి చేయాలని సూచించారు. పుష్కరాల నాటికి కొత్తగా 19 సబ్‌స్టేషన్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరును వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించగా, జూన్ నాటికి అర్హులైన దరఖాస్తుదారులకు కనెక్షన్లు మంజూరు చేసినట్లు అధికారులు వివరించారు. గత ఏడాదిలో సుమారు 12 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు అందించినట్లు వెల్లడించారు.విద్యుత్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసే దళారులను నమ్మి మోసపోవద్దని మంత్రి ప్రజలను హెచ్చరించారు. ఉద్యోగ నియామకాలు పూర్తిగా మెరిట్ ప్రాతిపదికనే జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఇప్పటివరకు విద్యుత్ శాఖ పరిధిలో 450 కారుణ్య నియామకాలు చేపట్టినట్లు గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.


## ఇరాన్‌పై అమెరికా ప్రతీకార దాడులు




**మొదటిపేజీ తరువాయి -** ప్రారంభించినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ఒక ప్రకటనలో తెలిపింది. "పశ్చిమాసియాలోని అమెరికా బలగాలపై ఇరాన్ చేసిన దాడి ప్రయత్నానికి ఇది గట్టి సమాధానం" అని సెంట్‌కామ్ పేర్కొంది. జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన 24 గంటల్లోపే ఈ దాడులు జరగడం గమనార్హం. అయితే, ఇరాన్ క్షిపణులను తమ వాయు రక్షణ వ్యవస్థలు విజయవంతంగా అడ్డుకున్నాయని అమెరికా అధికారులు తెలిపారు. ఈ ఘటన జరిగిన వెంటనే స్పందించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను "చాలా గట్టిగా దెబ్బతీస్తామని" హెచ్చరించారు.అమెరికా దాడుల తీవ్రత, లక్ష్యాల వివరాలను సెంట్‌కామ్ వెల్లడించనప్పటికీ, ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లో పేలుళ్లు సంభవించినట్లు అక్కడి ప్రభుత్వ మీడియా వెల్లడించింది. ముఖ్యంగా దక్షిణ ప్రావిన్సులైన హార్మోజ్‌గాన్, ఖుజెస్థాన్‌తో పాటు పర్షియన్ గల్ఫ్‌లోని కొన్ని దీవులపై దాడులు జరిగినట్లు పేర్కొంది. క్వెష్మ్ ద్వీపంలోని నివాస ప్రాంతాలపై దాడులు జరగడంతో శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం సహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపింది.కొంతకాలంగా ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష దాడులకు విరామం లభించగా, తాజా ఘటనతో సైనిక చర్యలు మళ్లీ తెరపైకి వచ్చాయి. దౌత్యపరమైన ప్రయత్నాలు మరోసారి విఫలమైనట్లు ఈ పరిణామం సూచిస్తోంది. అమెరికా సైన్యం దూకుడు చర్యలకు ప్రతిస్పందనగానే తాము దాడి చేశామని ఇరాన్ గతంలో పేర్కొంది.మరోవైపు, సైనిక దాడులతో పాటు ఇరాన్‌పై నావికా దిగ్బంధనాన్ని కూడా కఠినతరం చేస్తున్నట్లు సెంట్‌కామ్ వెల్లడించింది. జులై 29 నాటికి 20 వాణిజ్య నౌకలను దారి మళ్లించామని, రెండు నౌకలను నిలిపివేశామని, మరో రెండు నౌకలను తనిఖీ చేశామని సెంట్‌కామ్ తెలిపింది. సైనిక, ఆర్థిక, నావికాపరమైన ఒత్తిడి ద్వారా టెహ్రాన్‌ను కట్టడి చేయాలన్న అమెరికా వ్యూహంలో భాగంగా ఈ చర్యలు కొనసాగుతున్నాయి.

# విద్యకోసం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధం

**మొదటిపేజీ తరువాయి -** సీఎం ఇంటరాక్ట్ అయ్యారు. ప్రపంచంతో పోటీ పడాలంటే విద్యలో నాణ్యత పెరగాలని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ ఎంసీఆర్ హెచ్ఆర్డీలో ఇటీవల జర్మనీ, ఫిన్లాండ్ దేశాల్లో పర్యటించి అక్కడి విద్యా వ్యవస్థను స్టడీ చేసి వచ్చిన ఉపాధ్యాయులతో సీఎం మాట్లాడారు. ఈసందర్భంగా ఆయా దేశాల్లో తమ అనుభవాలను ఉపాధ్యాయులు పంచుకున్నారు. అక్కడ అవలంభిస్తున్న విధానాలు, అవి మన రాష్ట్రంలో అందిపుచ్చుకు నేందుకు ఉన్న అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి పన్నెండో తరగతి వరకు విద్యార్థులకు ప్రపంచజ్ఞానం నేర్పాలన్నారు. తాను మిడిల్ క్లాస్ అని తెలిపిన సీఎం, ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఏం చేస్తారని ఎవరైనా ప్రశ్నిస్తే తెలంగాణకు ముఖ్యమంత్రి అవుతా అని జవాబు ఇవ్వాలని అందుకు తానే ఉదాహరణ అని అభివర్ణించారు. ఆస్తులు లేకపోవటం వెనకబాటు తనం కాదని విద్య లేకపోవటమే అసలైన వెనకబాటు తనాని కి కారణం అని తాము చేపట్టిన సామాజిక, ఆర్థిక , విద్యా, ఉపాధి, కుల సర్వేలో తేలిందని వివరించారు.అధికారం, ఓట్లు ఎక్కువగా ఇచ్చే శాఖలపైనే సాధారణంగా అందరికీ మక్కువ ఉంటుందని ఓట్లు రావని తెలిసినా విద్యార్థుల భవిష్యత్తు, సమాజంలో మార్పు కోసమే తాను విద్యా శాఖ తీసుకున్నానని సీఎం పేర్కొన్నారు. ప్రపంచంతో తెలంగాణ విద్యార్థులు పోటీ పడాలన్నదే లక్ష్యమన్నారు. అయితే కొందరు





విద్యాశాఖకు మంత్రి లేదని త్వరగా ఆ శాఖకు ఓ మంత్రిని కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారన్న సీఎం, అయితే ఏ కారణంతో తాను విద్యాశాఖకు రాజీనామా చేయాలని ప్రశ్నించారు. గవర్నమెంట్ స్కూల్స్ లో చేరుతున్న వారి సంఖ్య పెంచినందుకా లేక విద్యార్థులకు అల్పాహార పథకం తీసుకువచ్చినందుకు రాజీనామా చేయాలా అని మండిపడ్డారు."ఉపాధ్యాయుల సమస్యల పరిష్కార బాధ్యతలను నేనే తీసుకుంటా. పిల్లల సమస్యలపై ఉపాధ్యాయ సంఘాలు నాతో కొట్లాడాలి. ఐఏఎస్‌లను బదిలీ చేయడం చాలా తేలిక, ఉపాధ్యాయులను బదిలీ చేయడం మాత్రం అంత సులభంకాదు. దేశానికి విద్య, వైద్యంలో నాయకత్వాన్ని తెలంగాణ నుంచి ఎందుకు ఇవ్వలేం. మండలాల్లో విద్యాభివృద్ధికి ఏం కావాలో ఉపాధ్యాయులు సలహాలు, సూచనలు ఇవ్వండి. టీచర్ల సలహాలను తీసుకుని అధికారులు అమలు చేస్తారన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.2034 వరకు తెలంగాణ తానే సీఎంగా ఉంటానన్న రేవంత్ రెడ్డి రానున్న ఐదేళ్లపాటు ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుపై దృష్టి పెట్టాలనికోరారు. ఉపాధ్యాయులు పిల్లల కోసం కష్టపడాలని ఉపాధ్యాయుల సమస్యలను తాను చూసుకుంటానని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులకు ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నామని భవిష్యత్తులోనూ వారి సమస్యల పరిష్కారానికి ఎప్పుడు కట్టుబడి ఉంటామన్నారు.మండల స్థాయిలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు మండలం ఒక యూనిట్ గా డిసెంబర్ నాటికి ఉపాధ్యాయ సంఘాలు, ఎంఈఓలు నివేదిక ఇవ్వాలని సీఎం ఆదేశించారు. ఇందుకోసం ఓ వెబ్ సైటని ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. ఏటా పది నుంచి 15 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారిని విదేశాలకు పంపి అక్కడి విధానాలను అధ్యయనం చేయిస్తామని సీఎం పేర్కొన్నారు. జర్మనీ, ఫిన్లాండ్ దేశాల్లో ఉపాధ్యాయులు పరిశీలించిన అంశాలు, అక్కడ చేసిన అధ్యయనం విద్యార్థులకు ఉపయోగపడాలని సీఎం ఆకాంక్షించారు. ఇకనుంచి ప్రతి ఏటా పది నుంచి 15 మంది ఉపాధ్యాయులకు ఈ తరహా అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. రానున్న ఐదేళ్ల పాటు ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉండాలని కోరారు.

## 'వందేమాతరం' దేవతల ఆరాధనను ప్రతిబింబిస్తుంది



**మొదటిపేజీ తరువాయి -** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కొత్త చట్టంపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ పార్లమెంట్ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పార్లమెంట్ సమావేశాలు వాయిదా పడిన అనంతరం విలేకరులతో మాట్లాడిన ఆయన, ఈ చట్టం దేశ రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధమని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.'జనగణమన', 'వందేమాతరం'ల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తూ ఒవైసీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మన జాతీయ గీతమైన 'జనగణమన' పాడినప్పుడు భారతదేశ వైవిధ్యం, ఇక్కడి ప్రజల ఐక్యత కళ్లముందు కదలాడుతాయని... అయితే 'వందేమాతరం' మాత్రం ఒక నిర్దిష్ట పూజా విధానాన్ని, దేవతల ఆరాధనను ప్రతిబింబిస్తుందని అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా 1950 నాటి చారిత్రక అంశాలను ప్రస్తావిస్తూ.. నాటి తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఎలాంటి పార్లమెంటరీ తీర్మానం లేకుండానే వందేమాతరానికి జాతీయ గేయ హోదా ఇవ్వడం సరైన నిర్ణయం కాదని వ్యాఖ్యానించారు. అసలు మన చట్టాల్లో గానీ, రాజ్యాంగంలో గానీ 'జాతీయ గేయం' అనే పదానికి కచ్చితమైన వర్గీకరణ లేదా నిర్వచనమే లేదని ఆయన గుర్తుచేశారు.ప్రస్తుతం కేంద్రం తెచ్చిన ఈ చట్టం రాజ్యాంగం పౌరులకు కల్పించిన ప్రాథమిక హక్కులపై దాడి చేయడమేనని ఒవైసీ ఆరోపించారు. ముఖ్యంగా ఆర్టికల్స్ 25, 26, 29 కింద లభించే మత స్వేచ్ఛను, సాంస్కృతిక హక్కులను ఈ బిల్లు కాలరాస్తోందని ధ్వజమెత్తారు.

## రామమందిర ట్రస్ట్ తొలి కార్యదర్శిగా ఐఐటీ పూర్వ విద్యార్థి



**మొదటిపేజీ తరువాయి -** కీలక బాధ్యతలు అప్పగించారు. ఇదే సమయంలో రామమందిర విరాళాల దుర్వినియోగ ఆరోపణలపై ప్రతిపక్ష పార్టీలు కేంద్ర ప్రభుత్వం, ట్రస్ట్‌ను ప్రశ్నించాయి. ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశాయి.జగదీశ్ అఫాలేను ట్రస్ట్ ఆర్థిక లావాదేవీలకు సంయుక్త అధికారిగా కూడా నియమించినట్లు సమాచారం. రామమందిరానికి వచ్చిన విరాళాల దుర్వినియోగ ఆరోపణల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో అక్రమాలు జరగకుండా ఈ నియామకం ఎలా ఉపయోగపడుతుందో ట్రస్ట్ వివరించాలని సమాజ్‌వాదీ పార్టీ అధికార ప్రతినిధి అశుతోష్ వర్మ కోరారు. చంపత్‌రాయ్‌పై ఇప్పటి వరకు ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదన్న ప్రశ్నకు కూడా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్‌రాయ్ కూడా ట్రస్ట్‌పై విమర్శలు చేశారు. పవిత్ర లక్ష్యంతో ఏర్పాటైన ట్రస్ట్‌లో అవినీతి ఆరోపణలు రావడం బాధాకరమన్నారు. ట్రస్ట్‌ను పునర్వ్యవస్థీకరించి శంకరాచార్యులు సహా ప్రముఖ సన్యాసుల ఆధ్వర్యంలో నిర్వహించాలని సూచించారు. అయోధ్య ప్రజలకు శ్రీరాముడితో చారిత్రక అనుబంధం ఉందని, వారికీ ట్రస్ట్‌లో ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.

## పంచాయతీ నిధుల పక్కదారిపై పూర్తి విచారణ జరపాలి



**మొదటిపేజీ తరువాయి -** చేస్తున్న నిధుల వినియోగంలో తీవ్ర అక్రమాలు జరుగుతున్నాయని, మార్గదర్శకాలకు విరుద్ధంగా నిధులను పక్కదారి పట్టిస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. కేంద్ర నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేయాలంటూ పంచాయతీ అధికారులపై, సర్పంచులపై ఒత్తిళ్లు తెస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ఈ నిధుల దుర్వినియోగంపై పూర్తిస్థాయి నిష్పాక్షిక విచారణ జరిపించాలని కోరుతూ కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్కలకు బండి సంజయ్ లేఖలు రాశారు.సర్పంచులు తమకు ఎదురవుతున్న ఒత్తిళ్లపై ఆధారాలతో సహా ఇచ్చిన ఫిర్యాదులను లేఖలకు జత చేసినట్లు ఆయన తెలిపారు. "గ్రామీణ వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి పంచాయతీరాజ్ వ్యవస్థే మూలస్తంభం. ఇక్కడ నిధులు పక్కదారి పడితే గ్రామాల అభివృద్ధి స్తంభించిపోవడమే కాకుండా, పంచాయతీల ఆర్థిక స్వయం ప్రతిపత్తి దెబ్బతింటుంది" అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు తక్షణమే జోక్యం చేసుకుని, ఆధారాల ఆధారంగా పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# ఉద్యమాల్లో "యువత" ఎందుకు పాల్గొనరాదు?

## భావ ప్రకటన హక్కు యువతకు లేదా?

**(సిరిసిల్ల రాజేంద్ర శర్మ) :** ఉద్యమాల్లో యువత ఎందుకు పాల్గొన రాదని చర్చ కొనసాగుతుంది. ప్రస్తుతం అసలు ఈ ఉద్యమాలు యువత ఎందుకు చేస్తారు ఆలోచించాల్సిందే. యువత చదువుకున్న చదువులకు సరిపడే ఉద్యోగాలు లేక నిరుద్యోగులుగా, చిరుద్యోగులుగా జీవితాన్ని వెళ్ళదీస్తూ నిరాశ నిస్పృహలకు లోనై ఉద్యమాలకు శ్రీకారం చుడతారు. ప్రజాస్వామ్య దేశాల్లో ఉద్యమాలు సహజమే యువత తమ నిరాశ నిస్పృహలని ప్రభుత్వాలకు తెలియజేయడానికి వివిధ రూపాల్లో ఉద్యమిస్తుంటారు. సమకాలిన పరిస్థితుల్లో యువత తమ భావాలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి "సోషల్ మీడియా" ప్రస్తుతం ఒక సాధనంగా మారింది. దీని ద్వారా తమ భావజాలాన్ని యువత ప్రభుత్వ దృష్టికి తీసుకొని రావడం సహజమే. ఉద్యమాలు చేసే హక్కు యువతకు లేదా?రాజ్యాంగం ప్రతి పౌరుడికి భావ ప్రకటన చేసే హక్కు కల్పించింది. భావ ప్రకటన చేయడానికి తమ హక్కులను వినియోగించుకోవడానికి యువత శాంతియుత మార్గంలో ఉద్యమాలు కొనసాగించి వాటి ద్వారా తమ హక్కులను పొందవచ్చు. ఉద్యమం తీవ్రతరమై హద్దులు దాటి హింస వైపుకు వెళ్తే చట్టం తన పని తాను చేసుకుని వెళుతుంది. అంతేకాకుండా "ఉద్యమ నాయకుల" ఉపన్యాసాల పిలుపులకు ప్రేరణ పొంది అమాయకులైన యువత ఉద్యమాలలో పాల్గొని పక్కదారి పట్టిన ఉద్యమంలో బలి పశువులవుతారు. అమూల్యమైన తమ భావి జీవితంలో పొందాల్సిన అవకాశాలను కోల్పోవాల్సి వస్తుంది. ఉద్యమ నేతలు ఈ సమయంలో తప్పించుకొని తిరుగుతారు. అమాయకులైన యువత తమకు తెలువకుండా చేసిన అపరాధానికి తగుమూల్యం చెల్లించుకోవడానికి పోలీస్ స్టేషన్ల చుట్టూ, న్యాయస్థానాల చుట్టూ తిరగాల్సి వస్తుందన్న "నగ్న సత్యాన్ని" యువత మర్చిపోరాదు. కేసుల ద్వారా తిరగడం వల్ల ఇరుగుపొరుగు వారి ముందే కాకుండా తమ కుటుంబ సభ్యుల ముందు కూడా ముద్దాయిలుగా ముద్రపడి బంగారు భవిష్యత్తుకు దూరం అవుతారు. "యువత తస్మాత్ జాగ్రత్త" తల్లిదండ్రుల బాధ్యత ఏమిటి?యువత పెడదారి పట్టకుండా చూడాల్సిన బాధ్యత కేవలం పోలీసు, చట్టాలదే కాదు. యువత తల్లిదండ్రులు వారి ఆలనా పాలన



చూస్తూ మంచి చదువులు చదివిస్తూ ఫీజులు చెల్లిస్తూ తమ బాధ్యత పూర్తి చేస్తున్నట్లు భావించరాదు. తమ పిల్లల నడవడిక మీద నిఘా ఉంచి ఎప్పటికప్పుడు జరుగుతున్న పరిణామాలను వారికి తెలిసేలాగా అవగాహన కల్పించాలి. లేనట్లయితే తమ పిల్లలు నేరాల్లో ఇరుక్కొని "బంగారు భవిత సమాధి" కావడానికి పరోక్షంగా తల్లిదండ్రులు బాధ్యులవుతారని మరిచిపోరాదు.

## భారీ వర్షాల నేపథ్యంలో యామాపూర్--ఫకీర్ కొండాపూర్ గ్రామాల వాగును పరిశీలించిన జిల్లా కలెక్టర్



**జగిత్యాల/ ఇబ్రహీంపట్నం జులై 30(ప్రజా మంటలు) :** గురువారం భారీ వర్షాల కారణంగా ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్--ఫకీర్ కొండాపూర్ గ్రామాల మధ్య ప్రవహిస్తున్న వాగును జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అశోక్ కుమార్ తో కలిసి పరిశీలించారు.వాగులో ప్రవాహ పరిస్థితులను పరిశీలించి ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వర్షాల కారణంగా వాగుల ప్రవాహం ఎక్కువ ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు వాటిని దాటేందుకు ప్రయత్నించవద్దని సూచించారు.ప్రమాదకర ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజల ప్రాణాలకు ఎలాంటి ముప్పు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ కు వెంటనే సమాచారం అందించాలని కలెక్టర్ కోరారు.ఈ పరిశీలనలో మెట్ పెల్లి డిఎస్పీ రాములు, తహసీల్దార్, ఎంపిడివో, సంబంధిత శాఖల అధికారులు, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపల్లి మండల కేంద్రంలో లోతట్టు ప్రాంతాలలో పర్యటించిన

### తాసిల్దార్ మహమ్మద్ అబ్దుల్ మాజీద్





**గొల్లపల్లి జులై 30 ప్రజా మంటలు :** గొల్లపల్లి మండల కేంద్రం లోని మహాత్మ జ్యోతి పూలే బాలికల హాస్టల్ వద్ద గత రెండు రోజుల నుంచి భారీ వర్షం కురుస్తున్న నేపథ్యంలో గురువారం గొల్లపల్లి గ్రామం లోని లోతట్టు ప్రాంతంలోని ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకొని వరద నీరు మళ్లించారు ఈ సందర్శనలో గొల్లపల్లి మండల తాసిల్దార్ మహమ్మద్ అబ్దుల్ మజీద్, ఎంపీడీవో రవీందర్ రావు,సర్పంచ్ నల్ల నీరజ, ఉప బుచ్చయ్య, వార్డ్ సభ్యులు పంచాయతీ సెక్రెటరీ జిపిఓ జవహర్, సందర్శించి ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు

## వర్షాల నేపథ్యంలో వెంటనే స్పందించేందుకు మూడు ప్రత్యేక రెస్క్యూ బృందాలు సిద్ధం

### జిల్లా ఎస్పీ అశోక్ కుమార్




**జగిత్యాల జులై 30 (ప్రజా మంటలు) :** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు జగిత్యాల జిల్లా పోలీసులు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉన్నారని జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్, ఐపీఎస్ తెలిపారు. వాగులు, వంతెనలు, లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారుల వద్ద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ జిల్లా అధికారులతో కలిసి వరద ప్రభావిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. భారీ వర్షాల కారణంగా ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందించేందుకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ పొందిన మూడు రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.ఈ బృందాలకు లైఫ్ జాకెట్లు, తాళ్లు, రెస్క్యూ కిట్లు, ఇతర ప్రత్యేక భద్రతా పరికరాలు అందుబాటులో ఉంచామని, వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, ప్రమాదంలో చిక్కుకున్న వారిని వెంటనే రక్షించడం వంటి చర్యలకు వీటిని వినియోగిస్తామని తెలిపారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తిన వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్-100కు సమాచారం అందించాలని సూచించారు.

## భారీ వర్షాలు నేపథ్యంలో ఇబ్రహీంపట్నం మండలంలో కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ సందర్శన,






**ఇబ్రహీంపట్నం జూలై 30 (ప్రజా మంటలు దగ్గుల అశోక్ ) :** భారీ వర్షాలు నేపథ్యంలో గురువారం రోజున ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని సదర్ మట్కా ప్రాజెక్ట్ మరియు యామాపూర్ ఫకీర్ కొండాపూర్ గ్రామాల మధ్య గల కల్వర్టుని గౌరవ జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్. జగిత్యాల జిల్లా కలెక్టర్ గౌరవ సత్యప్రసాద్ ఐఏఎస్ తో కలిసి సందర్శించడం జరిగింది, సదర్ మార్ట్ మూడు గేట్లు లేపి నీటిని విడుదల చేశారు, వీరితోపాటుగా మెట్పల్లి డిఎస్పి ఏ రాములు, మెట్పల్లి సిఐ బి సురేష్ బాబు, ఇబ్రహీంపట్నం ఎస్సై జి నవీన్ కుమార్, తహసిల్దార్ వరప్రసాద్, పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో జగిత్యాల జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ కొన్ని సూచనలు చేయడం జరిగినది 1.వరదలు ఎక్కువ అవుతున్నందున గొర్ల కాపర్లు గోదావరి నది వైపు గాని ఇతర వాగుల వైపు గాని వెళ్లకూడదు.2. చేపలు పట్టుటకు గోదావరి తీరానికి గాని వాగుల వైపు గాని వెళ్ళరాదు. 3. ఏదైనా ఇల్లు శిథిలావస్థలో ఉండి కూలిపోయే ప్రమాదం ఉన్న వాటి గురించి డయల్ 100 లేదా 112 కి ఫోన్ చేసి తెలుపగలరు. 4. కరెంటు స్తంభాల వద్ద నిలబడకుండా వాటిని ముట్టుకోకుండా జాగ్రత్త పడగలరు. 5. గోదావరి నది వైపు గాని వాగుల వైపు గాని ఈత కోసం గానీ లేదా సరదాగా సెల్ఫీ క్యాప్షన్ గాని వెళ్లకూడదు.6. వరద ఎక్కువగా ఉన్న కల్వర్టులను వాహనాలతో దాటే ప్రయత్నం చేయరాదు. ఏదైనా అత్యవసర సేవల కోసం డయల్ 100 లేదా 112 కి కాల్ చేసి పోలీస్ వారికి సమాచారం ఇవ్వగలరు అని తెలిపారు.

## వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం సందర్శించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్



**జగిత్యాల జులై 30 (ప్రజా మంటలు) :** వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది రాష్ట్ర మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్,ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, ఎస్పీ మహేష్ బి గితే స్వామి వారిని దర్శించుకొని పూజలు చేయడం జరిగింది ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రాష్ట్రంలో సమృద్ధి వర్షాలు కురవాలని, పాడి పంటలు పండాలని ప్రజలంతా ఆయు: ఆరోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు చేయడం జరిగింది.

## కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### పీఐబీ ఏడీజీ శృతి పాటిల్





**సికింద్రాబాద్,జూలై 30 ( ప్రజామంటలు):** కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరువ చేయాల్సిన అవసరం ఉందని పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) అడిషనల్ డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్ స్పష్టం చేశారు. గత 12 ఏళ్లలో కేంద్రం సాధించిన విజయాలపై గురువారం కవాడిగూడలోని సీజీవో టవర్స్‌లో పీఐబీ ఆధ్వర్యంలో 'వార్త' వర్క్‌షాప్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పలు కేంద్ర ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థల ఉన్నతాధికారులు హాజరై, తమ శాఖల ద్వారా చేపడుతున్న సంక్షేమ ఫలాలను వివరించారు. భవిష్యత్తులో మీడియా ద్వారా ప్రభుత్వ పథకాల ప్రచారాన్ని వేగవంతం చేసే చర్యలపై చర్చించారు. కేంద్ర పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అంది లబ్ధి చేకూరేలా చూడటమే లక్ష్యమని, ప్రచార సహకారానికి పీఐబీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఈ సందర్భంగా శృతి పాటిల్ పేర్కొన్నారు.

## తెలుగు వర్సిటీలో ఆగస్టు 6, 7న మేజిక్ డిప్లొమా సహా పలు కోర్సుల్లో తక్షణ ప్రవేశాలు




**సికింద్రాబాద్,జూలై 30 ( ప్రజామంటలు):**సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంద్రజాలం డిప్లొమా కోర్సుతో పాటు వివిధ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఆగస్టు 6, 7 తేదీల్లో తక్షణ (స్పాట్) ప్రవేశాలు నిర్వహించనున్నట్లు వర్సిటీ సెంట్రల్ అడ్మిషన్ కమిటీ డైరెక్టర్ ఆచార్య వనజ లాల్ వెల్లడించారు.ఈ సందర్భంగా వనజ లాల్ మాట్లాడుతూ.. రెగ్యులర్ కోర్సులతో పాటు సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సులకు కూడా ఈ స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని స్పష్టం చేశారు. ప్రవేశాలు పొందగోరే ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ సంబంధిత విద్యార్హత పత్రాలు, ఇతర అవసరమైన ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా ఆయా విభాగాల్లో హాజరై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వర్సిటీలోని వివిధ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లను అత్యంత పారదర్శకంగా భర్తీ చేయడమే ఈ స్పాట్ ప్రవేశాల ముఖ్య ఉద్దేశమని తెలియజేశారు. అర్హత కలిగిన విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆచార్య వనజ లాల్ కోరారు. ఇంకా వివరాలకు 9705439608 లో సంప్రదించాలని ఇంద్రజాల కోర్సు నిర్వాహకులు ప్రముఖ మెజీషియన్ సామల వేణు కోరారు.

## రహదారులపై పడిపోయిన చెట్లను వెంటనే తొలగించిన జగిత్యాల పోలీసులు



**జగిత్యాల జులై 30 (ప్రజా మంటలు) :** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పలుచోట్ల రహదారులపై చెట్లు కూలిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న వెంటనే జగిత్యాల జిల్లా పోలీసులు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని చెట్లను తొలగించి ట్రాఫిక్‌ను యథావిధిగా పునరుద్ధరించారు.బుగ్గారం పోలీస్ స్టేషన్ పరిదిలోని గంగాపూర్ గ్రామంలో రహదారిపై చెట్టు కూలిపోవడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చెట్టును తొలగించి వాహనాల రాకపోకలకు మార్గాన్ని క్లియర్ చేశారు.పెగడపల్లి--రామడుగు ప్రధాన రహదారిపై భారీ చెట్టు కూలిపోవడంతో బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.అలాగే కొండగట్టు మండలం రాజారం గ్రామ సమీపంలోని హైవే రహదారిపై రెండు చెట్లు కూలిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సంబంధిత శాఖల సిబ్బందితో కలిసి చెట్లను తొలగించి హైవేను పూర్తిగా క్లియర్ చేశారు. భారీ వర్షాల సమయంలో అత్యవసరం అయితే తప్ప ప్రయాణాలు చేయవద్దని, రహదారులపై చెట్లు, విద్యుత్ స్తంభాలు లేదా ఇతర అడ్డంకులు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్--100కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## మున్సిపల్ కార్మికులకు రెయిన్‌కోట్లు పంపిణీ చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్



**జగిత్యాల జూలై 30(ప్రజా మంటలు) :** పట్టణంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, వర్షం, ఎండ అనే తేడా లేకుండా ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించడంలో మున్సిపల్ కార్మికులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, కౌన్సిలర్లు పిట్ట ధర్మరాజు, కూతురు రాజేష్, ఏ.ఈ. అశోక్ రాజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేష్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ శ్రీకాంత్‌తో పాటు సంబంధిత అధికారులు, మున్సిపల్ సిబ్బంది మరియు పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## కృష్ణవేణి స్కూల్‌లో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ క్యాంప్




**సికింద్రాబాద్, జూలై 30 ( ప్రజామంటలు):** సికింద్రాబాద్ బోలక్‌పూర్ లో గాంధీ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో విద్యార్థినులకు గురువారం హెచ్‌పీవీ (గర్భాశయ క్యాన్సర్ నివారణ) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్న వయసులోనే ఈ టీకా తీసుకోవడం వలన భవిష్యత్తులో వచ్చే క్యాన్సర్ల బారిన పడకుండా రక్షణ లభిస్తుందని వైద్యసిబ్బంది వెల్లడించారు.ఈ వ్యాక్సినేషన్ డ్రైవ్‌లో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంతి, ఏఎన్ఎం రాఘవమ్మ, అకౌంటెంట్ పుష్ప, పీహెచ్ఎన్ లాలమ్మలతో పాటు పాఠశాల హెడ్మాస్టర్ డాక్టర్ మంచాల వరలక్ష్మి, డైరెక్టర్ డాక్టర్ మంచాల శ్రీనివాస్,ఉపాధ్యాయ బృందం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సీఎం రేవంత్ రెడ్డికి తృటిలో తప్పిన ప్రమాదం

**20 నిమిషాల పాటు గాల్లో చక్కర్లు కొట్టిన విమానం**

**శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తప్పిన ప్రమాదం**

**ఢిల్లీ నుంచి శంషాబాద్ చేరుకున్న ఇండిగో విమానానికి రాని క్లియరెన్స్**

**20 నిమిషాల పాటు గాల్లో చక్కర్లు కొట్టిన విమానం**



హైదరాబాద్?లోని శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి తృటిలో ప్రమాదం తప్పింది. ఢిల్లీ నుంచి హైదరాబాద్ బయల్దేరిన ఇండిగో (6ఇ717) విమానానికి శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లో వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ల్యాండింగ్‌కు క్లియరెన్స్ రాలేదు. దాంతో ల్యాండింగ్ అవుతున్న సమయంలో విమానాన్ని పైలట్ తిరిగి టేకాఫ్ చేశాడు. 20 నిమిషాల పాటు విమానం గాల్లోనే చక్కర్లు కొట్టింది. బుధవారం రాత్రి 8:35 నిమిషాలకు ఈ ఘటన జరిగింది. విమానంలో సీఎం రేవంత్ రెడ్డి సహా 229 మంది ప్రయాణికులు ఉన్నారు. అనంతరం విమానం సేఫ్‌గా ల్యాండింగ్ అవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 3 రోజులు ఢిల్లీలో బిజీ బిజీ : సోమవారం మధ్యాహ్నం ఢిల్లీ చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి అదే రోజు సాయంత్రం పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నిర్వహించిన సమీక్షా సమావేశానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్‌తో కలిసి హాజరయ్యారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం, సంస్థాగత వ్యవహారాలపై చేపడుతున్న కార్యక్రమాలు, సంఘటనా సృజన్ అభియాన్ అమలు, సంస్థాగత శిక్షణ కార్యక్రమాలు, పార్టీకి ప్రభుత్వానికి మధ్య సమన్వయం వంటి అంశాలపై చర్చించారు. మంగళవారం ఉదయం పార్లమెంటుకు వెళ్లిన రేవంత్ రెడ్డి పార్టీకి సంబంధించిన పలువురు నేతలను, కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీలకు చెందిన ఎంపీలతో ముచ్చటించారు. ఆ తర్వాత కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి శివరాజ్‌సింగ్‌తో భేటీ అయ్యారు. గత 12 ఏళ్లలో రాష్ట్రానికి గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి ఒక్క ఇల్లు కూడా మంజూరు కాలేదని, మిగతా రాష్ట్రాలకు రూ.వేల కోట్లు ఇచ్చినా తెలంగాణ తీసుకోలేదన్న విషయాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 11.56 లక్షల మంది అర్హత కలిగిన పేదల కోసం గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. తెలంగాణలో వ్యవసాయ సమస్యలు ఉపాధి హామీ నిధుల విడుదల, కొత్త పనులకు సంబంధిత శాఖ రాష్ట్ర మంత్రి ఇచ్చిన ప్రతిపాదనలపై కూడా చర్చించిన రేవంత్ రెడ్డి, ఎల్‌నినో వల్ల వర్షాలు లేకపోవడం, కరవు పరిస్థితులు, పంటల ఉత్పత్తి తగ్గుదల, రకరకాల వ్యవసాయ సమస్యలు ఉత్పన్నం అవుతున్నందున కేంద్రం నుంచి క్షేత్రస్థాయి పరిస్థితిని పరిశీలించి అంచనా వేసేందుకు అధికారుల బృందాలను పంపి రాష్ట్రంలో పర్యటించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రిని కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన సీఎం తన ప్రతిపాదనలకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని, త్వరలోనే కేంద్ర బృందాలను పంపడంతో పాటు ఇళ్లు కూడా మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అదే సందర్భంలో హైడ్రాపై విపక్షాలు చేస్తున్న విమర్శలను ఖండించారు. కబ్జాలు చేసేవాళ్లే హైడ్రాను వ్యతిరేకిస్తున్నారని, ఇకపై కూడా హైడ్రా కొనసాగుతుందని తేల్చి చెప్పారు. హైకోర్టు ఆదేశాలను పరిశీలించాక తగిన నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇకపై తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య ఉండదని స్పష్టం చేశారు. అదే రోజు సాయంత్రం తనను కలిసిన స్కైరూట్ ఏరోస్పేస్ వ్యవస్థాపకులు పవన్ కుమార్ చందన, నాగభరత్‌లను సీఎం అభినందించారు. సాంకేతిక పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణ అనుకూలం అని వారికి చెప్పారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్‌కు : బుధవారం కాంగ్రెస్ కేంద్ర కార్యాలయం ఇందిరా భవన్‌లో జరిగిన రాష్ట్ర పార్టీ సమన్వయ కమిటీ భేటీకి తెలంగాణ నేతలతో కలిసి హాజరయ్యారు. అక్కడే పలువురు పార్టీ నేతలను కలుసుకున్న సీఎం, సాయంత్రం తిరిగి హైదరాబాద్ పయనం అయ్యారు. ఆ సందర్భంలోనే హైదరాబాద్ చేరుకున్న విమానానికి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి ల్యాండింగ్‌కు క్లియరెన్స్ లభించకపోవడంతో 20 నిమిషాల హైడ్రామా అనంతరం విమానం సేఫ్‌గా ల్యాండ్ అయ్యింది.

# తెలంగాణలో వాన జోరు

**ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు**

**తాలిపేరు, వట్టి వాగు ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల**

**గోదావరి ఉధృతికి పలుచోట్ల నిలిచిపోయిన రాకపోకలు**

**సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల్లోకి వరద.. పూర్తిగా ఆగిన బొగ్గు ఉత్పత్తి**



తెలంగాణతో పాటు ఎగువ ప్రాంతాల్లో గత రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కృష్ణా, గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. జలాశయాలకు వరద నీరు పోటెత్తుతుండటంతో రైతాంగంలో ఆశలు చిగురిస్తుండగా, మరోవైపు పలుచోట్ల వరద ప్రభావం తీవ్రంగా ఉంది. ప్రధానంగా, సింగరేణి గనుల్లోకి నీరు చేరడంతో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర అంతరాయం కలిగింది. మంచిర్యాల జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ప్రస్తుతం 46 వేల క్యూసెక్కుల ఇన్-ఫ్లో నమోదవుతోంది. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 12.88 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని తాలిపేరు ప్రాజెక్టుకు 96,445 క్యూసెక్కుల వరద వస్తుండటంతో అధికారులు 24 గేట్లు ఎత్తి 96,472 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. అటు కొమురం భీం జిల్లాలోని వట్టి వాగు ప్రాజెక్టుకు 8 వేల క్యూసెక్కుల ఇన్-ఫ్లో వస్తుండగా, 3 గేట్లు ఎత్తి 10,500 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. మరోవైపు, భారీ వర్షాల కారణంగా జనజీవనం అస్తవ్యస్తమైంది. జగిత్యాల జిల్లాలో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ధర్మపురి వద్ద పుష్కర ఘాట్లను వరద తాకింది. అనంతారం బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. భారీ వర్షాల ధాటికి మంచిర్యాల జిల్లాలోని ఇందారం, శ్రీరాంపూర్, కల్యాణి ఖని వంటి సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల్లోకి భారీగా వరద నీరు చేరింది. దీనివల్ల రోజుకు సుమారు 30 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తితో పాటు 2 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీత పనులు నిలిచిపోయాయని అధికారులు వెల్లడించారు. వర్షాలు తగ్గుముఖం పట్టాకే గనుల్లో పరిస్థితి సాధారణ స్థితికి వస్తుందని వారు పేర్కొన్నారు.

# ఏపీలో పెట్టుబడుల వరద

**రూ.1.44 లక్షల కోట్ల ప్రతిపాదనలకు ఎస్ఐపీసీ గ్రీన్ సిగ్నల్**

**మరో రెండు భారీ డేటా సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు**

**అనకాపల్లిలో రూ.85 వేల కోట్లతో 'రెన్యూ గ్రీన్' డేటా సెంటర్**

రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి కొత్త పుంతలు తొక్కుతోంది. రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ సంస్థలు క్యూ కడుతున్నాయి. ఐటీ, గ్రీన్ ఎనర్జీ, సోలార్ రంగాల్లో వేలాది కోట్ల రూపాయల పెట్టుబడులతో పరిశ్రమలు స్థాపించేందుకు బహుళజాతి సంస్థలు ముందుకొచ్చాయి. తాజాగా రాష్ట్రంలో రూ.1,44,943 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ప్రతిపాదనలపై రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ (ఎస్ఐపీసీ) సుదీర్ఘంగా చర్చించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ అధ్యక్షతన బుధవారం సచివాలయంలో జరిగిన ఈ ఉన్నతస్థాయి భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రాభివృద్ధిని పరుగులు పెట్టించే ఈ భారీ ప్రాజెక్టుల ద్వారా సుమారు 9,367 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. డేటా సెంటర్లకు పెద్దపీట : రాష్ట్రంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు సంస్థలు అత్యధిక ఆసక్తి చూపుతున్నాయి. మొత్తం పెట్టుబడుల ప్రతిపాదనల్లో రూ.1.16 లక్షల కోట్లు కేవలం రెండు డేటా సెంటర్ల నుంచే రావడం విశేషం. అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో 'రెన్యూ గ్రీన్' సంస్థ ఏకంగా రూ.85 వేల కోట్లతో 1000 మెగావాట్ల డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. హైపర్ స్కేల్ తరహాలో నిర్మించే ఈ భారీ ప్రాజెక్టు ద్వారా 1,880 మందికి ఉపాధి లభించనుంది. అలాగే విశాఖపట్నం జిల్లా భీమునిపట్నంలో 'ఏఎం ఇంటెలిజెన్స్ ల్యాబ్స్' రూ.31,387 కోట్ల పెట్టుబడితో 512 మెగావాట్ల గ్రీన్ ఇంటిగ్రేటెడ్ డేటా సెంటర్‌ను నెలకొల్పేందుకు ప్రతిపాదించింది. దీని ద్వారా మరో వెయ్యి మందికి ఉపాధి దొరకనుంది. గ్రీన్ ఎనర్జీపై సంస్థల ఫోకస్ : డేటా సెంటర్లతో పాటు గ్రీన్ హైడ్రోజన్, సోలార్, విండ్ ఎనర్జీ రంగాల్లో పెట్టుబడుల వరద పారుతోంది. కాలుష్య రహిత పరిశ్రమలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుండటంతో సంస్థలు అదే దిశగా అడుగులు వేస్తున్నాయి. కాకినాడలో వారీ క్లీన్ ఎనర్జీ సొల్యూషన్స్ రూ.15 వేల కోట్లతో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టును ఏర్పాటు చేయనుంది. దీనివల్ల 1,500 మందికి ఉపాధి దక్కుతుంది. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో అగస్త్య గ్రీన్ ఎనర్జీ రూ.7,799 కోట్లతో సోలార్ తయారీ యూనిట్‌ను నెలకొల్పనుంది. విశాఖలో అక్షత్ గ్రీన్‌టెక్ రూ.1,600 కోట్లతో టాప్‌కాన్ సోలార్ సెల్ ప్లాంట్‌ను స్థాపిస్తోంది. కర్నూలు జిల్లాలో జాక్సన్ గ్రీన్ రెన్యూవబుల్ రూ.1,533 కోట్లతో విండ్, సోలార్ హైబ్రిడ్ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఉపాధి కల్పనలో కీలక అడుగులు : రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమం అవుతోంది. చిత్తూరు జిల్లా కుప్పంలో ప్రముఖ సంస్థ హిందాల్కో ఇండస్ట్రీస్ రూ.880 కోట్లతో అల్యూమినియం ఎక్స్‌ట్రూషన్ ప్రాజెక్టును ప్రతిపాదించింది. దీనికి 60 ఎకరాల భూమి కేటాయింపుపై కమిటీ పరిశీలించింది. కర్నూలు జిల్లాలో ఓచార్ గ్రీన్ ఫ్యూయల్స్ (రూ.616 కోట్లు), ఆరాధ్య, ఉషోదయ బయోగ్యాస్ ప్లాంట్లు (చెరో రూ.143 కోట్లు) ఏర్పాటు కానున్నాయి. విజయనగరం జిల్లాలో ఎఫ్‌పీఈఎల్ రైవాడ పవర్ సంస్థ రూ.480 కోట్లతో సోలార్ ప్రాజెక్టును, గణేశ సాయి మౌమిష సంస్థ రూ.66 కోట్లతో స్టీల్ యూనిట్‌ను నెలకొల్పనున్నాయి. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే దిశగా తిరుపతిలో ఆర్కే2 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (రూ.150 కోట్లు), కాకినాడలో సన్‌రైజ్ హోటల్స్ (రూ.54 కోట్లు) పెట్టుబడులు పెట్టనున్నాయి. అలాగే విశాఖలో రూ.90 కోట్లతో ఎస్త్రేల లాజిస్టిక్స్ పార్క్ ఏర్పాటుకు ప్రతిపాదనలు అందాయి. పాత ఉత్తర్వుల్లో కీలక సవరణలు : కొత్త పెట్టుబడుల రాకతో పాటు, గతంలో ప్రభుత్వం జారీ చేసిన పలు అనుమతులపై ఎస్ఐపీసీ సమీక్ష నిర్వహించింది. అదానీ ఎస్‌పీవీ (గూగుల్ డేటా సెంటర్)కు విశాఖలో కేటాయించిన భూముల సేల్ అగ్రిమెంట్‌లో మార్పులు చేయాలని నిర్ణయించారు. విశాఖలో ఎకోబాక్స్ ఇండస్ట్రియల్స్, నెల్లూరులో ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా, అనకాపల్లిలో ఎమ్నార్ ఫార్మా సంస్థలకు కేటాయించిన భూముల రిజిస్ట్రేషన్లు, సేల్ డీడ్ మార్పులపైనా లోతుగా చర్చించారు. అనకాపల్లిలో వారీ ఎనర్జీ సంస్థ వాణిజ్య ఉత్పత్తి ప్రారంభ తేదీ గడువు పెంపు ప్రతిపాదనను పరిశీలించారు. కర్నూలు జిల్లాలో ఎస్ఏఈఎల్ సోలార్ ప్రాజెక్టుకు అదనపు భూముల కేటాయింపుపై చర్చలు జరిపారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, పరిశీలించిన ప్రతిపాదనలన్నింటినీ ముఖ్యమంత్రి నేతృత్వంలోని రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలికి (ఎస్ఐపీబీ) పంపనున్నారు. అక్కడ సీఎం ఆమోదముద్ర పడిన వెంటనే ఈ భారీ ప్రాజెక్టులు పట్టాలెక్కనున్నాయి.

# శ్రీశైలానికి కృష్ణమ్మ పరవళ్లు

ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఆందోళన చెందుతున్న వేళ వారిలో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. కర్ణాటకలోని ఆలమట్టి, నారాయణపూర్ జలాశయాలు నిండుకుండలా మారడంతో జూరాల ప్రాజెక్టు దిగువన కృష్ణా జలాలు భారీగా విడుదలవుతున్నాయి. కృష్ణా నది ఎగువ పరివాహ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల నుంచి 79,403 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం ప్రాజెక్టుకు చేరుతోంది. శ్రీశైలం నీటిమట్టం గురువారం ఉదయం 6 గంటలకు 824.80 అడుగులు, నీటి నిల్వ 44.6090 టీఎంసీలుగా నమోదయింది. శ్రీశైలం కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించలేదు. జూరాలకు పెరుగుతున్న ప్రవాహం: వరద ఉద్ధృతితో జూరాల జలాశయం కళకళలాడుతోంది. కర్ణాటకలోని ఆలమట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి 3 రోజులుగా దిగువకు కృష్ణా జలాలు విడుదల చేస్తుండటంతో జూరాలలో క్రమేపీ మట్టం పెరుగుతోంది. జూరాల ఇన్‌ఫ్లో గురువారం ఉదయం 80వేల క్యూసెక్కులుగా నమోదైంది. జలవిద్యుత్ ఉత్పత్తితో 47వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలు కాగా



10 గేట్లు ఎత్తి శ్రీశైలానికి నీరు విడుదల చేశారు.

# ఏకధాటిగా వర్షాలు

**ఓపెన్ కాస్ట్ గనుల్లోకి చేరిన వరద నీరు , సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి బ్రేక్**

**రామగుండంలో రెండు రోజులుగా కురుస్తున్న వానలు , గనుల్లో భారీగా చేరిన వరద నీరు**

**సింగరేణి 4 ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం**



పెద్దపల్లి జిల్లా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో రెండు రోజుల నుంచి ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నాయి. ఫలితంగా సింగరేణి సంస్థ నాలుగు ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. 4 ఉపరితల గనుల్లో రోజుకు వంద టన్నుల మేర బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. ఉపరితల గనుల్లో భారీగా వరద చేరడంతో భారీ యంత్రాలు యార్డుకే పరిమితమయ్యాయి. మంచిర్యాల, కుమురం భీం జిల్లాల్లోని ఓపెన్ కాస్ట్ గనుల్లో కురుస్తున్న వర్షాల కారణంగా బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు కురిసిన ఎడతెరిపి లేని వర్షాల వల్ల ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీనివల్ల మట్టిని తొలగించే పనులు, బొగ్గు ఉత్పత్తి రెండూ నిలిచిపోయాయి. గనులకు వెళ్లే దారులు బురదమయంగా మారి, రవాణాకు ఆటంకం ఏర్పడింది. షవల్స్, డంపర్లు సహా ఇతర భారీ యంత్రాలు యార్డులకే పరిమితమయ్యాయి. వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం : ఈ రెండు జిల్లాల్లోని మూడు ప్రాంతాల్లో మొత్తం ఐదు ఉపరితల గనులు ఉన్నాయి. బుధవారం ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోవడంతో సుమారు 29,000 టన్నుల బొగ్గు ఉత్పత్తికి నష్టం వాటిల్లింది. శ్రీరాంపూర్ ప్రాంతంలో 15,220 టన్నులు, బెల్లంపల్లిలో 7,400 టన్నులు, మందమర్రి ప్రాంతంలో 6,407 టన్నుల మేర ఉత్పత్తి నిలిచిపోయింది. గనుల నుంచి కొత్తగా బొగ్గును వెలికితీసే పనులు నిలిచిపోయినప్పటికీ, డంప్ యార్డుల్లో ముందుగానే నిల్వ ఉంచిన బొగ్గును రవాణా చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. నీటిని బయటకు పంపే ఏర్పాట్లు : ఉపరితల గనుల్లోని పని ప్రదేశాల్లో చేరిన వర్షపు నీటిని బయటకు పంపేందుకు అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. వర్షాలు కొనసాగితే మరింత నీరు చేరే అవకాశం ఉందని భావించి, వారు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నీటిని నిరంతరాయంగా బయటకు పంపడానికి అధిక సామర్థ్యం గల మోటార్లను ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకలకు వీలుగా అంతర్గత రహదారులను సిద్ధం చేస్తున్నారు. అలాగే మట్టిని తొలగించే పనులు, బొగ్గు ఉత్పత్తిని వీలైనంత త్వరగా పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఓపెన్ కాస్ట్ గనుల వద్ద ఉన్న పరిస్థితుల గురించి సంస్థ డైరెక్టర్ ఆయా ప్రాంతాల అధికారులతో మాట్లాడి ఆరా తీస్తున్నారు.

## తెలంగాణలో 7,437 పోలీస్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

**ఈ సర్టిఫికెట్లు సిద్ధం చేసుకోండి , 7,437 పోస్టుల భర్తీకి 4 నోటిఫికేషన్లు జారీ**

**త్వరలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం**




రాష్ట్రంలో పోలీస్ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న వేలాది మంది నిరుద్యోగులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. తెలంగాణ పోలీస్ నియామక మండలి పోలీస్, ఎస్పీఎఫ్, ఫైర్, జైళ్ల శాఖల్లో ఖాళీగా ఉన్న 7,437 పోస్టుల భర్తీకి వేర్వేరుగా నాలుగు నోటిఫికేషన్లు విడుదల చేసింది. ఎస్సై నుంచి కానిస్టేబుల్ వరకు వివిధ విభాగాల్లో నియామకాలు చేపట్టనుండగా, దరఖాస్తు తేదీలను త్వరలో ప్రకటిస్తామని బోర్డు తెలిపింది. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. తెలంగాణ పోలీస్ శాఖలో మరోసారి కొలువుల సందడి మొదలైంది. 7,437 పోస్టుల భర్తీ కోసం తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) బుధవారం రాత్రి నోటిఫికేషన్లు జారీ చేసింది. పోలీస్, అగ్నిమాపక, జైళ్లు, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) శాఖలకు సంబంధించి వేర్వేరుగా 4 ప్రకటనలు వెలువడ్డాయి. వీటిలో ఎస్సై, ఏఎస్సై, కానిస్టేబుల్ పోస్టులు మొత్తంగా 7 వేలకు పైగా ఉన్నాయి. పోలీస్ ఉద్యోగాల అభ్యర్థులు మండలి వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్లికేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే దరఖాస్తుల స్వీకరణ తేదీని మాత్రం బోర్డు ఇంకా ప్రకటించలేదు. దరఖాస్తు ప్రొఫార్మాను త్వరలోనే వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నట్లు పోలీస్ ఉద్యోగాల నియామక మండలి ఛైర్మన్ వి.వి.శ్రీనివాస రావు వెల్లడించారు. అభ్యర్థులు పీఎంటీ, పీఈటీ ప్రమాణాలు సరిగా ఉన్నట్లు నిర్ధారించుకున్న తర్వాతే పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. ఈ ధ్రువీకరణ పత్రాలు సమకూర్చుకోండి ఆన్‌లైన్‌లో అప్లికేషన్ చేసే ముందే తెలంగాణలో స్థానికులైన అభ్యర్థులు కొన్ని సర్టిఫికెట్లను సమకూర్చుకోవాలని మండలి సూచించింది. బీసీ అభ్యర్థులు ఈ ఏడాది ఏప్రిల్ 1 తర్వాత తీసుకున్న నాన్ క్రీమీలేయర్ ధ్రువపత్రం సిద్ధం చేసుకోవాలి. అభ్యర్థులంతా 1 నుంచి 7 తరగతుల వరకు బోనఫైడ్ సర్టిఫికెట్లు లేదంటే రెసిడెన్సీ ధ్రువీకరణ పత్రం (రెండింటిలో ఏవి వర్తిస్తే అవి) రెడీగా ఉంచుకోవాలి. దివ్యాంగ, స్పోర్ట్స్ తదితర ప్రత్యేక కేటగిరీల కింద అర్హులైతే వాటికి సంబంధించిన ధ్రువపత్రాలు దగ్గర పెట్టుకోవాలి. ఎస్సీ అభ్యర్థులు ఎస్సీ గ్రూప్-1, 2, 3 ఉపవర్గీకరణతో కూడిన తాజా కుల ధ్రువపత్రం పొంది ఉండాలి. ఎస్టీ అభ్యర్థులు తమ క్యాస్ట్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి. ఈడబ్ల్యూఎస్ (ఆర్థికంగా బలహీనవర్గాలు) అభ్యర్థులు ఈ ఏడాది ఏప్రిల్ 1 తర్వాత ప్రభుత్వం నుంచి పొందిన ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌ను సిద్ధం చేసుకోవాలి. తెలంగాణలో 7,437 పోలీస్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఈ సర్టిఫికెట్లు సిద్ధం చేసుకోండి

**ఖాళీలు ఇలా**

ఎస్సై (సివిల్) - 148 ఎస్సై (ఏఆర్)-14 ఎస్సై (టీజీఎస్పీ) - 12 ఎస్సై (ఎస్ఏఆర్‌సీపీఎల్) - 3 ఏఎస్సై (ఫింగర్ ప్రింట్ బ్యూరో) - 23 కానిస్టేబుల్ కానిస్టేబుల్ (సివిల్) - 3,697 కానిస్టేబుల్ (ఏఆర్) -1052 ఎస్ఏఆర్‌సీపీఎల్ - 24 పీటీవో డ్రైవర్ - 20 కానిస్టేబుల్ మెకానిక్ -7 స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ) - 44 అగ్నిమాపకశాఖ (ఫైర్), విపత్తు నిర్వాహణ స్టేషన్ ఫైర్ ఆఫీసర్: 39 ఫైర్ ఫైటర్: 751 జైళ్ల శాఖలో డిప్యూటీ జైలర్(పురుషులు): 14 డిప్యూటీ జైలర్(మహిళలు): 1 వార్డర్(పురుషులు): 196 వార్డర్(మహిళలు): 12 ప్రత్యేక రక్షణ దళం(ఎస్‌పీఎఫ్)లో ఎస్సై: 44 కానిస్టేబుల్: 1,380 దరఖాస్తు తేదీలను త్వరలో ప్రకటిస్తామని పోలీస్ నియామక మండలి తెలిపింది.

## హాస్పిటల్స్ అనుమతులకు సింగిల్ విండో

**తమిళనాడు ప్రభుత్వ కీలక నిర్ణయం , తమిళనాడులో ఆసుపత్రుల ఏర్పాటుకు సింగిల్ విండో విధానం**

**ఏళ్ల తరబడి సాగే అనుమతుల ప్రక్రియకు స్వస్తి , సీఎం విజయ్ సమీక్ష తర్వాత ఉత్తర్వులు జారీకి రంగం సిద్ధం**

**లంచాల ఆరోపణలకు చెక్ పెట్టనున్న కొత్త ఫీజుల విధానం**



వైద్య ఆరోగ్య రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించే దిశగా తమిళనాడు ప్రభుత్వం కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో నూతన ఆసుపత్రుల ఏర్పాటుకు అవసరమైన అనుమతుల కోసం 'సింగిల్ విండో క్లియరెన్స్' (ఏకగవాక్ష) విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. దీనివల్ల ఏళ్ల తరబడి వివిధ ప్రభుత్వ శాఖల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, అనుమతుల ప్రక్రియ కేవలం కొన్ని నెలల్లోనే పూర్తి కానుంది. ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ శుక్రవారం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సమావేశం అనంతరం దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు (జీవో) జారీ అయ్యే అవకాశం ఉంది. ఈ నిర్ణయంతో పారిశ్రామికంగా పురోగతి సాధిస్తున్న మహారాష్ట్ర, గుజరాత్ వంటి రాష్ట్రాల సరసన తమిళనాడు కూడా నిలవనుంది. ప్రస్తుత విధానంలో ఆసుపత్రి భవనాలు, ప్రాజెక్ట్ డిజైన్లకు అనుమతులు లభించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ ప్రక్రియలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని, కొన్ని సందర్భాల్లో రూ. 40-50 లక్షల వరకు లంచాలు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com